ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





గెలుస్తాం : కాకినాడలో పవన్‌తో అభ్యర్థుల సమైక్య నినాదం



ఈ జెండా ఎగరనివ్వొద్దు : వైసీపీ జెండాలు మడతపెట్టి ఇంటిబాటపట్టిన మహిళలు



సభలో మాట్లాడుతున్న జగన్



బాబోయ్.. జగన్!

- జగన్ సభ నుంచి జనం పరుగో పరుగు
- ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపించిన సీఎం
- నన్ను గెలిపించకపోతే డబ్బులు రావని బెదిరింపు
- కన్నీళ్లు పెట్టుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

పిఠాపురం, మే 11: జగన్ ఇలా ఇలా అనాలని చెబుతుంటే..జనం మాత్రం అలా అలా అంటూ పరుగులు తీశారు. ప్రసంగం ప్రారంభించగానే సభ నుంచి పెద్ద ఎత్తున మహిళలు తిరుగుముఖం పట్టారు. వారిని ఆపేందుకు నేతలు ప్రయత్నించి విఫలమయ్యారు.మరోవైపు సీఎం సభ పిఠాపురం ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. నడిచి వెళ్లేవారిని సైతం పోలీసులు అడ్డుకున్నారు. దుకాణాలను సైతం మూయించివేశారు.సభకు రెండు కిలోమీటర్ల దూరం లోనూ బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను ముప్పుతిప్పలు పెట్టారు. యథావిధిగా సీఎం జగన్ అబద్ధాలు వల్లెవేశారు. వంగా గీతను గెలిపిస్తే డిప్యూటీ సీఎంను చేస్తానని ప్రకటించారు. అది కూడా డిప్యూటీ సీఐ అంటూ ఉదహరించడం ఆశ్చర్యపరిచింది.తనను గెలిపించకపోతే బటన్ నొక్కిన పథకాల నిధులు రావంటూ ప్రజలను బెదిరించే ప్రయత్నం చేశారు. పవన్‌కల్యాణ్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గాన్ని తన ఎన్నికల ఆఖరి ప్రచార సభ కోసం సీఎం జగన్ ఎంచుకున్నారు.శనివారం మధ్యాహ్నం 2.55 గంటలకు పిఠాపురం రావాల్సిన జగన్ గంటకు పైగా ఆలస్యంగా ఇక్కడకు చేరుకున్నారు. నేరుగా బస్సులో ఉప్పాడ సెంటర్‌కు చేరుకుని అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అన్ని సభల్లో మాదిరిగా గత మేనిఫెస్టో 99 శాతం అమలుచేశానంటూ గొప్పలు చెప్పుకున్నారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ప్రజలకు మంచి చేసే ఒక్క పనిచేయలేదంటూ వారిని నమ్మించే ప్రయత్నం చేశారు. 60 నెలలు సీఎంగా మీరు అవకాశం ఇచ్చారు, కానీ 57 నెలలకే నా గొంతు నొక్కేశారంటూ వాపోయారు. పవన్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడంతో జనం అసహనం వ్యక్తం చేశారు. సీఎం ప్రసంగం పూర్తయ్యేసరికి సభా ప్రాంగణం సగానికి పైగా ఖాళీ అయింది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్ నా పుట్టుక పిఠాపురం కాదంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారని, నన్ను పిఠాపురం ప్రజలు నుంచి దూరం చేయాలని చూస్తున్నారు. నా బిడ్డ సాక్షిగా చెబుతున్నా ఇక పిఠాపురం వదిలివెళ్లనన్నారు. నా అంతిమ సంస్కారాలు పిఠాపురం పాదగయ క్షేత్రం చెంతనే చేయాలని కోరుకుంటున్నా అని కన్నీరు పెట్టుకున్నారు. సీఎం జగన్ సభకు జనసమీకరణకు వైసీపీ నేతలు అష్టకష్టాలు పడ్డారు. వచ్చినవారికి రూ.300, బిరియాని ప్యాకెట్లు ఇచ్చి నట్టు చెబుతున్నారు. మద్యాన్ని కూడా పంపిణీ చేశారు. సీఎం సభ జరిగే ప్రాంతంలోనే కాకుండా ఇటు కోటగుమ్మం సెంటర్ వరకు, ఉప్పాడ రైల్వేగేటు వరకు షాపులు మూసివేయించారు. తినేందుకు, తాగేందుకు ఏమీ దొరకక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సీఎం సభతో ప్రజలు నరకయాతన అనుభవించారు. పిఠాపురం పట్టణంలోకి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను అనుమతించలేదు. అన్ని వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించారు. దీంతో పిఠాపురం పట్టణంలోకి వచ్చేవారు, కొత్తపల్లి మండలానికి వెళ్లవలసిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైపాస్ రోడ్డు నుంచి రెండు, మూడు కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. సభ వద్ద ప్రజల కంటే పోలీసులు సంఖ్య అధికంగా కనిపించింది. ఏకంగా 1300 మంది పోలీసులను బందోబస్తు నిమిత్తం వినియోగించారు. సభలో కాకినాడ ఎంపీ వైసీపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



జనాలను తెచ్చి.. ఎండలో వదిలేసి : మూసివేయించిన షాపుల వద్ద వేచి ఉన్న మహిళలు



అభిమానంతో ఆశీర్వదించండి : కాకినాడలో ఎన్నికల చివరి బహిరంగ సభలో పవన్

గెలుపు మనదే

వైసీపీ అభ్యర్థులను ఓడించండి..

- పేట్రేగిన ద్వారంపూడి అక్రమాలు
- అధికారమిస్తే.. అంతు చూస్తా
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

కలెక్టరేట్ (కాకినాడ), మే 11: కాకినాడ నగరాన్ని రౌడీల రాజ్యంగా తయారు చేసి ప్రజలకు భద్రత లేకుండా చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లో శనివారం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల చివరి బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ద్వారంపూడి కాకినాడను గంజాయికి కేపిటల్‌గా మార్చేసి యువత జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. పచ్చటి మడ అడవ లను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. అక్రమంగా బియ్యం రవాణా.. ఆయిల్ మాఫియా ద్వారా కోట్లు ఆర్జిస్తున్నారని విమర్శించారు. కాకినాడలో పేకాట క్లబ్‌లను నడుపుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. ద్వారంపూడి అనుచరులు భూకబ్జాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని... ఇలాంటి తరుణంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మరిన్ని అక్రమాలు చేస్తారని హెచ్చరించారు. ద్వారంపూడి తండ్రి సివిల్ సప్లయిస్ చైర్మన్‌గా, తమ్ముడు రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉండి అనేక విధాలుగా ఈ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. ఇలాంటి ద్వారంపూడిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించకపోతే కాకినాడ నగరానికి భవిష్యత్తు ఉండదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ద్వారంపూడిని నడిరోడ్డుపై మోకాళ్లపై కూర్చోబెట్టి నడిపిస్తానని హెచ్చరించారు. కాకినాడలో ఆడబిడ్డలు రోడ్డుపై తిరగాలంటే భయపడుతున్నారని.దీనికి కాకినాడలో ద్వారంపూడికి చెందిన బ్లేడు బ్యాచే కారణమని ఆరోపించారు.యువత ధైర్యంగా ఓటేసి ద్వారంపూడి వంటి రౌడీలను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. రోజుకోపార్టీ మారుతున్న వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను ఓడించాలన్నారు. కాకినాడ పార్లమెంట్ జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్, సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థులు పంతం నానాజీ, వనమాడి కొండబాబులను గెలిపించాలని అభ్యర్థించారు.





నీ కష్టం తీరుస్తా : రైతుతో పవన్



జనం కోసం ఎంతకైనా దిగొస్తా : చేబ్రోలులో పాదయాత్రగా వస్తున్న పవన్‌కల్యాణ్, వర్మ

దుర్గాడలో పవన్ రోడ్ షో

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మే 11: ప్రజలతో కలిసి నడుస్తూ.. సమస్యలు అడిగి తెలుసుకుంటూ..యువతను అక్కున చేర్చుకుంటూ పిఠాపురంలో జనసేన అధినేత పవన్ చివరి ఎన్నికల ప్రచారం చేశారు.గొల్లప్రోలు మండలం దుర్గాడలో శనివారం మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. అడుగడుగునా జననీరాజనం పలికారు. చేబ్రోలు వై.జంక్షన్ నుంచి బైపాస్‌రోడ్డులోని తన నివాసం వరకూ పాదయాత్రగా నడిచారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు బాధితుడినంటూ ప్లకార్డు ప్రదర్శించిన దుర్గాడకు చెందిన గంగాధర్‌తో కలిసి నడిచారు. మెగా పవర్‌స్టార్ రామచరణ్, తన తల్లి సురేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌లతో కలిసి పిఠాపురం పాదగయ క్షేత్రంలోని విఘ్నేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, పురుహూతికాఅమ్మవారు, కుక్కుటేశ్వరస్వామి,రాజరాజేశ్వరీదేవిలను దర్శించుకున్నారు.



బాబాయ్‌ని గెలిపించండి
పిఠాపురంలో అభిమానులకు రామ్‌చరణ్ అభివాదం



తమ అభిమాన నాయకుడిని చూడాలని : పవన్ కోసం వేచి ఉన్న దుర్గాడ ప్రజలు

ప్రచారానికి తెర

అమలాపురం టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. అలసిసొలసిన అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు కాస్త రిలీఫ్ అయ్యారు. కానీ వారిలో టెన్షన్ ఇంకా తగ్గలేదు. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ మొదలైనప్పటి నుంచీ వారంతా ప్రజా క్షేత్రంలోనే ఉన్నారు. అభ్యర్థులుగా ఖరారైన తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ నేతలు క్షణం తీరిక లేకుండా ప్రచారం చేశారు. చివరి రోజున మరింత ఉధృతంగా ప్రచారం చేశారు. ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించారు. శనివారం సా యంత్రం ఆరు గంటలకు ప్రచార ముగియగానే ప్రలోభాలకు తెరదీశారు.


ప్రచారం ముగిసిన తర్వాత వాహనాలు ఇలా...

1,200 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

అమలాపురం టౌన్, మే 11: జిల్లాలోని 1200 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చిత్రీకరణ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పోలింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి 149 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పండుగలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలింగ్ నిర్వహణ, సన్నద్ధత, విధి విధానాలను వివరించారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రచారం ముగిసిందని, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించామన్నారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 600 పోలింగ్ కేంద్రాల్లో వెయ్యి మందికి పైబడి ఓటర్లు ఉన్నారు. 13వ తేదీ ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలో 15,31,410 మంది ఓటర్లు ఉన్నారని, వారి కోసం 1,644 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 563 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించి భద్రతాపరమైన చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ సిబ్బంది తరలింపునకు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్

497 బస్సులు, 40 మినీ బస్సులు, 310 టాటా మేజిక్‌లు, 233 ఇతర వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాను 149 రూట్లుగా విభజించామన్నారు. ఎనిమిది సహాయ వ్యయ పరిశీలకుల బృందాలు, ఎనిమిది అక్కౌంటింగ్ బృందాలు, 64 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 64 స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు, 14 వీఎస్టీ బృందాలు, ఏడు వీడియో బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీకి సంబంధించి 58 కేసులు నమోదు కాగా వాటిలో ఎనిమిది సీజ్ కేసులు ఉన్నాయన్నారు. జిల్లాలో 15,600 మంది పోలింగ్ విధులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. 13 కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు రానున్నాయన్నారు. గతం కంటే నాలుగు రెట్లు అదనంగా భద్రతా బలగాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో మోహరించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత కల్పించామన్నారు. అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ ముగిసే వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న తుపాకులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ద్వారా రూ.8.72 కోట్ల విలువైన సొమ్ములను జప్తు చేశామని, 200 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

జిల్లాలో ఏడు ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు

అమలాపురం టౌన్, మే 11:

సార్వత్రిక ఎన్నికల ఘట్టం చివరి దశకు చేరుకుంది. శనివారం సాయంత్రం ప్రచార పర్వం ముగియడంతో వాహనాలన్నీ నిశబ్ధంగా గమ్యస్థానాలకు చేరుకున్నాయి. అత్యంత కీలకమైన పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో భాగంగా జిల్లాలో ఏడు పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వీఎస్ఎం కళాశాల బి-బ్లాక్‌లో రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్ (మొబైల్: 9618415521), ఏఆర్వో ఎం.వెంకటేశ్వరరావు (మొబైల్: 9849903904) నేతృత్వంలో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ ఆదివారం ప్రారంభమవుతుంది. ముమ్మిడివరంలోని డాక్టర్ ఎంజీఆర్ జూనియర్ కళాశాలలో ఆర్వో వి.మదన్‌మోహనరావు (మొబైల్: 8977935812), ఏఆర్వో బి.శ్రీనునాయక్ (మొబైల్: 9849903897) నేతృత్వంలోను, అమలాపురం ప్రభుత్వజూనియర్ బాలికల కళాశాలలో ఆర్వో జి.కేశవర్ధనరెడ్డి (మొబైల్: 9849903866), ఏఆర్వో జి.కనకరాజు (మొబైల్: 9849903888), రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్వో ఎస్.నుపూర్‌అజయ్ (మొబైల్: 8977935212), ఏఆర్వో కె.గోపాలకృష్ణ (మొబైల్: 9849903891), పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని ముంగండ పీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్వో ఎ.శ్రీరామచంద్రమూర్తి (మొబైల్: 9490499695), ఏఆర్వో ఎస్‌కే హుస్సేన్ (మొబైల్: 9849903896), కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్వో జీవీవీ సత్యనారాయణ (మొబైల్: 91549 83101), ఏఆర్వో జి.ఎలీషా (మొబైల్: 9849903894). మండపేటలోని శ్రీవేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రిటర్నింగ్ అధికారి డీవీఎస్ యల్లారావు (మొబైల్: 7799219259), ఏఆర్వో ఎం.సురేష్‌కుమార్ (మొబైల్: 98499 03903) నేతృత్వంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తారు.

రూ.11.34 లక్షల నగదు స్వాధీనం

అమలాపురం రూరల్, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల ఆధ్వర్యంలో శనివారం జిల్లాలో నిర్వహించిన విస్తృత తనిఖీల్లో రూ.11,34,924 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. మండపేట టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎఫ్ఎస్టీ బృందం రూ.8,34,924, రామచంద్రపురం పోలీసు స్టేషన్ పరిధిలో రూ.3 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆలమూరు పీఎస్ పరిధిలో నాటుసారాను అక్రమంగా రవాణా చేస్తుండగా ఒక వ్యక్తిని అరెస్టు చేసి రూ.33వేలు విలువైన 110 లీటర్ల నాటుసారా, మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో 13 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 22 ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు, 7.70 లీటర్ల ఐఎంఎల్, 173 డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పేరూరు వై.జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పోలీసు పరిశీలకుడు ఎంవీ చంద్రకాంత్ తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.


వాడపల్లి వెంకన్నను దర్శించుకుంటున్న భువనేశ్వరి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఖాయం

వాడపల్లి వెంకటేశ్వరస్వామి, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిలను దర్శించుకున్న నారా భువనేశ్వరి

అంతర్వేది, మే 11: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణిభువనేశ్వరి అన్నారు. శనివారం ఆమె లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భువనేశ్వరిని టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. టీడీపీ సఖినేటిపల్లి మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, తిరుమాని ఆచార్యులు, వనమాలి మూలాస్వామి, గుండుబోగుల వాసు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


అంతర్వేదిలో...

ఆత్రేయపురం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి శనివారం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు వసంత మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. భువనేశ్వరి వెంట ఆమె సోదరి లోకేశ్వరి, సోదరి కుమారుడు శ్రీనివాస్, బంధువులు వున్నారు. భువనేశ్వరికి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు సతీమణి కమలారాణి, కుమార్తె రమ్య దుశ్శాలువా కప్పి స్వామివారి చిత్రపటం అందజేశారు.

దాట్ల బుచ్చిబాబును గెలిపించాలి

జనసేన శ్రేణులకు పవన్‌కల్యాణ్ పిలుపు

ముమ్మిడివరం, మే 11: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. శనివారం పిఠాపురంలో తనను కలవడానికి వచ్చిన సుబ్బరాజును పవన్ అభినందించారు.మంచి మనసున్న వ్యక్తి అయిన సుబ్బరాజుకు సైకిల్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలకు పవన్ సూచించారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిస్థితిపై సుబ్బరాజును పవన్‌కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. సమయాభావం వల్ల తాను రాలేకపోయానన్నారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని, సుబ్బరాజును గెలిపిస్తే నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తారన్నారు. అరాచక పాలన సాగిస్తున్న జగన్‌ను గద్దె దింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఉన్నారు.



ప్రాణం తీసిన స్నానం సరదా: గోదావరిలో మునిగి యువకుడి మృతి

ఆత్రేయపురం/గోపాలపురం, మే 11: సరదాగా స్నానానికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బొబ్బర్లంకలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడికి చెందిన గ్రే వీర వెంకట శశికుమార్ (18) ఇద్దరు స్నేహితులతో కలిసి సెల్‌ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు శనివారం ఉదయం రాజమహేంద్రవరం వెళ్లాడు. రిపేర్ చేయించుకుని ఇంటికి తిరిగొస్తూ మార్గమధ్యంలో బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద అన్నపూర్ణమ్మ గుడి సమీపంలో నదీ స్నానానికి వెళ్లారు. కాలు జారడంతో శశికుమార్ మునిగిపోయాడు. స్నేహితులిద్దరూ గ్రహించి ఒడ్డుకు చేరుకుని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్థానికులు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆత్రేయపురం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.


శశికుమార్ (పాత చిత్రం)


బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో హరీష్‌మాధుర్


వివిధ సంఘాల నాయకులతో అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి హరీష్


హరీష్‌మాధుర్, భాస్కరరావులను సన్మానిస్తున్న దృశ్యం

మీ ఓటు.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 11: మీ ఓటు రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం ముగింపు సందర్భంగా బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం ఉదయం అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో హరీష్‌మాధుర్‌ను కలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంజనీరింగ్ చదువుతున్న వారితో పాటు ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసినవారికి ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వలసపోయి పడుతున్న ఇబ్బందులను హరీష్ మాధుర్ దృష్టికి తీసుకువచ్చారు. మీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ అవకాశాలు ఎలా కల్పిస్తారని పలువురు విద్యార్థులు ప్రశ్నించారు. దాంతో హరీష్ స్పందిస్తూ ఉద్యోగాలు రావాలి అంటే పరిశ్రమలు నెలకొల్పాలి. వైసీపీ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేసింది. కూటమి తరపున చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడతాయని అందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించినట్టు వివరించారు. హైదరాబాద్ హైటెక్ సిటీని నిర్మించిన ఘనత చంద్రబాబుదే. అదే తరహాలో కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క విద్యార్థి ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లకుండా రాష్ట్రంలోనే హైటెక్ సిటీని నిర్మించడం ఖాయమన్నారు. విద్యావంతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణను ఇప్పటికే రూపొందించామన్నారు. కోనసీమలో టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. తద్వారా ఎందరికో ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వివిధ సంఘాల నాయకులు, ప్రజలు తరలివచ్చి హరీష్‌కు మద్ధతు తెలిపారు. ప్రచారంలో భాగంగా ఉప్పలగుప్తం, కొత్తపేట, మండపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి ముఖ్య నాయకులను కలుసుకోవడంతో పాటు పలుచోట్ల ప్రచారాలు నిర్వహించారు. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలను ముఖ్య నాయకులకు ఆయన వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పోలిశెట్టి భాస్కరరావు, పెయ్యల దుర్గారావు, బొంతు బాలరాజు, అరిగెల నానాజీ తదితరులు పాల్గొన్నారు.






ఆనందరావు, రమణబాబులను సన్మానిస్తున్న దృశ్యం, నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న కూటమి అభ్యర్థి ఆనందరావు

రాష్ట్రాభివృద్ధికి మీ ఓటే ఆయుధం కావాలి

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం టౌన్, మే 11: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు అమలు జరగాలన్నా మీ ఓటే ఆయుధమని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా పడిపోయిందన్నారు. భవిష్యత్తులో పుట్టబోయే బిడ్డలపై కూడా లక్షల రూపాయల అప్పుల భారం మోపిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకోవడంతో శనివారం ఆనందరావు పలు గ్రామాల్లో పర్యటించి ముఖ్య నాయకులను కలుసుకున్నారు. ఉదయం పార్టీ కార్యాలయానికి నియోజకవర్గ నలుమూలల నుంచి వివిధ గ్రామాల నాయకులు తరలివచ్చి మద్దతు తెలిపారు. పలువురు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులను ఘనంగా సత్కరించారు. అనంతరం జనసేన నాయకులతో చర్చలు జరిపారు. పోలింగ్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని ఏజెంట్లకు సూచించారు. వారికి అవసరమైన సరంజామా అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి ముఖ్య నాయకులను కలుసుకుని దిశానిర్దేశం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మండల శాఖల అధ్యక్షులు మల్లుల పోలయ్య, దెందుకూరి సత్తిబాబురాజు, అరిగెల నానాజీ, పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, తెలుగు మహిళ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, అధికారి బాబ్జీ, పొలమూరి ధర్మపాల్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మంథా ఫణికుమార్, మొయిల శివ, పెద్దిరెడ్డి రాము, చొల్లంగి సత్యసాయిబాబా పాల్గొన్నారు. పతి విజయాన్ని కోరుతూ ఆనందరావు సతీమణి అరుణ బండారులంకలో ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట నాయకులు చింతా శంకరమూర్తి, పెనుమాల సునీత, పిచ్చిక శ్యామ్, మాడా మాధవి, కాశిన బాబి, కొండా సత్యనారాయణరాజు వున్నారు.


సాకుర్రులో ముఖ్య నాయకులతో ఆనందరావు


బండారులంకలో ప్రచారం నిర్వహిస్తున్న చేస్తున్న ఆనందరావు సతీమణి అరుణ


కూటమి అభ్యర్థి ఆనందరావుకు అల్లవరం మండల నాయకుల మద్దతు




పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దాత రామకృష్ణంరాజు, భద్రపీఠంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ఘనంగా ప్రారంభమైన వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భద్రపీఠంపై ఊరేగిన స్వామి, అమ్మవార్లు... ఐదు రోజులు ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఐ.పోలవరం, మే 11: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, దీక్షాధారణ, స్వామి, అమ్మవార్లకు అభిషేకం, వధూవరులను చేయుట, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, సాయంత్రం భద్రపీఠంపై ఊరేగింపు జరిగాయి. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవ మూర్తుల దాత జంపన రామకృష్ణంరాజు, మహిళామండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని పచ్చితోరణాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. భద్ర పీఠంపై స్వామి, అమ్మవార్ల అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.


భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి



ఓటు నోటు



అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా ఒకరోజే ఉండడంతో వైసీపీ పూర్తిగా బరితెగించేసింది. ఓడిపోతున్నామన్న భయంతో అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. జనం ఎలాగూ తమకు ఓట్లు వేయరన్న భయంతో నేరుగా కోట్ల కట్టలతో పంపకాలు చేస్తోంది. గ్రామాల్లో రాజీనామా చేసిన వలంటీర్లను వెంటబెట్టుకుని ఓట్లను కొనుగోలు చేస్తోంది. ఓటుకు నియోజకవర్గం బట్టి రూ.3వేల నుంచి రూ.2వేల వరకు పంచుతోంది. ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉంటే అంతమందికి డబ్బులు చదివిస్తోంది. అటు వెండి గిన్నెలు,కుంకుమ భరిణీలు ఇచ్చి ఓట్లు కొనుగోలుకు బరితెగిస్తోంది.

కోనసీమలో ప్రలోభాలు



అమలాపురం టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా వేయికళ్లతో చూడాల్సిన 'నిఘా' వ్యవస్థ నిద్రపోయింది. ఫలితంగా ఓటర్ల ప్రలోభ చర్యలు పబ్లిక్‌గా సాగిపోతున్నాయి. ఎన్నికల విధుల పేరుతో బిజీగా ఉన్న అధికార యంత్రాంగం ప్రలోభ చర్యలను పట్టించుకోకపోవడంతో రాజకీయ పార్టీలు పేట్రేగిపోతున్నాయి. రెండు రోజులుగా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి నగదును రహస్యంగా తరలించి ఓటర్ల ప్రలోభానికి వినియోగిస్తున్నారు. కాగా పబ్లిక్‌గా ఓటర్లకు నగదు, కానుకలతో పాటు పురుషులకు తాగినంత మద్యాన్ని పంపిణీ చేస్తూ తమ భవితవ్యానికి బంగారు బాట వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పర్వానికి తెరలేపారు. కోనసీమలోని అన్ని ప్రాంతాల్లో మద్యం ఓటర్లకు సరఫరా అవుతూనే ఉంది. ఇంటింటికీ తిరిగి బహిరంగంగా ఓటరు స్లిప్పులతో పాటు రూ.1,500 నుంచి రూ.2వేలు వంతున నగదు పంపిణీని వైసీపీ నాయకులు అప్పుడే రహస్యంగా పూర్తి చేసినట్టు తెలిసింది. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ తరపున రూ.1,500 నుంచి రూ.2వేల వరకు నగదు పంపిణీ చేశారు. గత ఎన్నికల కంటే ఈ సారి ఖర్చు పెరిగిందని ఆ పార్టీల నేతలే వాపోతున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో త్రిముఖపోటీ జరగ్గా ఒక సామాజికవర్గానికి పూర్తిగా రెండు ప్రధాన పార్టీలు నగదు చెల్లించలేదు. ఈసారి ఎన్నికల్లో ఆ సామాజికవర్గానికి రెండు పార్టీల వారు అదనంగా నగదు పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ పార్టీల శిబిరాల నుంచి లక్షలాది రూపాయల నగదు చేతులు మారుతుండడంతో పాటు రవాణా అవుతున్న ఈసారి నిఘా బృందాలు పెద్దగా దృష్టి సారించలేదు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అమలాపురం, గన్నవరం, రాజోలు, కొత్తపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థుల తరపున రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వంతున ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మహిళలకు అదనంగా చీరలు కూడా పంపిణీ చేశారు. విజయంపై ధీమాతో ఓటర్లకు నేరుగా పంపిణీ చేయకుండా కొందరు నాయకులు సొమ్ముల స్వాహా పనిలో రంగంలోకి దిగారు.ఈ తరహా పరిస్థితి అన్ని నియోజకవర్గాల్లోనూ అన్ని పార్టీల్లోనూ ఉంది. ద్వితీయ శ్రేణి నాయకులు భారీగా సొమ్ములు స్వాహా చేస్తున్న తీరు పోటీలో ఉన్న అభ్యర్థులకు తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. ముమ్మిడివరం నియోజకవర్గంలో అభ్యర్థులు భారీగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల దళారులు ఈ పరిస్థితిని బాగా సొమ్ము చేసుకుంటున్నారు. తాము చెప్పినట్టు వినకపోతే ప్రత్యర్థి వర్గంతో చేతులు కలిపి నష్టం కలిగిస్తామంటూ హెచ్చరించి అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఎక్కడికక్కడే పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం దాడులు చేయకపోవడంతో పట్టపగలే ఓటరు లిస్టులతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి మరీ పంపకాలు చేస్తున్నారు. శనివారం సాయంత్రానికే పంపిణీ పర్వం పూర్తి చేయడం విశేషం.

ఓటర్లను కొనేస్తున్నారు!



- పోలింగ్‌కు ఒకరోజే ఉండడంతో జిల్లాలో అధికార వైసీపీకి ఓటమి జ్వరం
- ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఎదురీదుతోన్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు
- ఎలాగైనా ఓట్లు కోసం కోట్లకు కోట్లు నోట్లు వెదజల్లుతోన్న వైనం
- పిఠాపురంలో పవన్ ఓటమే లక్ష్యంగా ఓటుకు రూ.4వేలు ఇస్తున్న వైసీపీ
- పెద్దాపురం,తుని,కాకినాడరూరల్,కాకినాడ సిటీల్లో రూ.2వేల చొప్పున..



(కాకినాడ,ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇస్తే తప్ప పార్టీకి ఓట్లు పడవనే నిర్ణయానికి వచ్చి డబ్బు పంపకాల జాతర చేస్తోంది వైసీపీ. పిఠాపురంలో పవన్‌పై ఓటమి ఖాయమని అర్థమైపోవడంతో వైసీపీ రాక్షస ప్రయత్నం కొనసాగిస్తోంది. అందుకోసం యు.కొతపల్లి,పిఠాపురం, గొల్లప్రోలు రూరల్ ప్రాంతాల్లో ఏకంగా ఓటుకు రూ. 3 వేలు నుంచి 4 వేలు చొప్పున పంపిణీ చేస్తోంది. మత్స్యకార, ఎస్సీ గ్రామాల్లో రూ.4 వేలు పంచింది. ఇతర సామాజిక వర్గాలున్న ప్రాంతాల్లో రూ.3 వేల చొప్పున పంపిణీ చేస్తోంది. ఒక్క పిఠాపురంలో రూ.45 కోట్ల వరకు డబ్బులు వెచ్చిస్తోంది. కాకినాడ సిటీలో ఎమ్మెల్యే ద్వారంపూడికి ఓటమి బెంగ పట్టుకుంది. దీంతో వార్డుల్లో రూ.2 వేల వరకు పంపిణీ ప్రారంభించారు. ఇంటింటికి తన మనుషుల ద్వారా డబ్బులు, చీరలు పంపిణీ చేయిస్తున్నారు. కులసంఘాలు, ఇతర కీలక నేతలకు రూ.లక్ష చొప్పున ఇచ్చారు. కాకినాడ రూరల్‌లో ఎమ్మెల్యే కన్నబాబు అనుచరులు చీరతో పాటు ఓటుకు రూ.2వేలు వరకు వెదజల్లుతున్నారు. కుల సంఘాలకు రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు పంచుతున్నారు. ప్రత్తిపాడులో అభ్యర్థి వరుపుల సుబ్బారావును ఎలాగైనా గట్టెక్కించడానికి ఎమ్మెల్సీ అనంతబాబు నోట్ల కట్టలనే నమ్ముకున్నారు. గ్రామాల్లో వెయ్యి, మండల కేంద్రాల్లో 2వేల చొప్పున అనుకన్నా వ్యతిరేకత తీవ్రంగా ఉండడంతో అందరికీ రూ.రెండు వేల వరకు పంపిణీ చేస్తున్నారు. తుని, జగ్గంపేటలో రూ.వెయ్యి. టీడీపీకి బాగా బలమున్న ప్రాంతాల్లో రూ.2వేల చొప్పున వెదజల్లుతున్నారు. పెద్దాపురంలో ఏమాత్రం సానుకూల ఫలితం కనిపించకపోవడంతో ఇక్కడ వైసీపీ ఓటుకు రూ.2 వేల వరకు గ్రామాల నుంచి పంచుకువస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గాల్లో కడప నుంచి వచ్చిన బృందాలు డబ్బులు,మద్యం పంపిణీ బాధ్యత తలకెత్తుకున్నాయి. వీరంతా స్థానికంగా రూ.20 వేలకు స్కూటీలు కొనుగోలు చేసి అందులోంచి డబ్బులు తరలిస్తున్నారు. అలాగే అనేక నియోజకవర్గాల్లో డబ్బును ఇప్పటికే సముద్రంలో బోట్ల ద్వారా కూడా పంపించారు.

నగదు..మందు..బిర్యానీ

పిఠాపురం, మే 11: ఎన్నికల ప్రచారం ముగియడంతో ప్రలోభాలకు తెరలేచింది. ఇప్పటికే పిఠాపురం నియోజకవర్గంలో ఓటుకు రూ.3 వేలు వంతున పంచుతున్న వైసీపీ నేతలు శనివారం రాత్రి నుంచి బిర్యానీ ప్యాకెట్లు, మద్యం పంపిణీ ప్రారంభించారు. కోరినంత మద్యాన్ని అందిస్తున్నారు. ఓటుకు డబ్బులు ఇవ్వడంతో పాటు వారి ఓటు వేస్తామని ప్రమాణం చేయించుకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోని వార్డుల్లో బహిరంగంగానే డబ్బుల పంపిణీ జరుగుతున్నది. పలుచోట్ల సొమ్ములు పంపిణీ వ్యవహారంలో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు చోటా మోటా నేతలతో పాటు కడప, చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన నేతల వద్ద ఉంటున్న కొందరు నాయకులు భారీగా సొమ్ము నొక్కేసినట్లు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో పలువురు వైసీపీ నేతలకు డబ్బులు ఇచ్చినట్లు నమోదు చేసి వాటిని తమ జేబుల్లో వేసినట్లు సమాచారం. ఓటర్లకు డబ్బులు పంపిణీ మాట ఎలా ఉన్నా ప్రస్తుతం వైసీపీ నేతల మధ్య ఈ సొమ్ముల వ్యవహారం చిచ్చుపెట్టింది.

రూ.500 నోటుదే హవా

పెద్దాపురం, మే 11 : ఎన్నికల ముందు రోజు అర్థరాత్రి వరకూ డబ్బుతోనే అసలైన పని. ఎక్కడ చూసినా డబ్బు పంపణీపైనే చర్చ. పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ నేతలు కంటిపై కునుకు లేకుండా పోతోంది. గత ఎన్నికల్లో హంగామా చేసిన రూ. 2 వేల నోటు ప్రస్తుతం కనుమరుగయ్యింది. ఇప్పుడు రూ.500 పెద్ద దిక్కు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇప్పటికే గత కొన్నాళ్లుగా రూ.500 నోటు మార్కెట్లో కానరావడం లేదు. ప్రస్తుతం రూ.100, రూ.200 మాత్రమే కనిపిస్తున్నాయి. కరెన్సీలో రూ.500 నోటు పెద్దది కావడంతో లావాదేవీలకు సులభం. ఎన్నికల్లో రూ. 500 నోటు హవా నడుస్తోంది అంటున్నారు. డబ్బుతో పాటు మందుబాబుల కోసం మద్యం సీసాలను సమకూర్చుకుంటున్నారు. ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 13 రాత్రి 7 గంటల వరకూ అధికారులు డ్రై డేగా ప్రకటించారు.

నాయకుల నొక్కుడు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఓట్ల కొనుగోలు అనేది సాధారణ విషయంగా మారిపోయింది. యంత్రాంగం ఎంత హడావుడి చేసినా నోట్ల ప్రలోభం మాత్రం సాగుతూనే ఉంది. అయితే, ఈ నోట్ల పంపిణీ ఈసారి అభ్యర్థులకు సంకటంగా మారింది. ఓటరు లిస్టుల ప్రకారం బూత్‌ల వారీగా ఓటర్లకు డబ్బుల పంపిణీకి స్థానికంగా ఉండే నాయకులకు అభ్యర్థులు, పార్టీలు ఎన్నికల షెడ్యూల్‌కు ముందే డబ్బులు సర్దుబాటు చేశాయి. ఒక్కో ఓటుకు రూ.2500 నుంచి రూ.3వేల వరకూ పంచిపెడుతున్నారు. ఇదే ఇప్పుడు వ్యతిరేకతను కూడా తీసుకొస్తోంది. ఒక పోలింగ్ బూత్‌లో 100 మంది ఓటర్లు ఉన్నారంటే.. వారందరికీ ఇవ్వాలంటూ 'పైనుంచి' ఆయా అభ్యర్థులకు డబ్బులు పంపించారని తెలుస్తోంది. వైసీపీ ఒక్కో అభ్యర్థికి రూ.30 కోట్ల వరకూ పంపిందని చెబుతున్నారు. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులు కొంత మందిని నియమించుకొని పంపిణీ అప్పగించారు. వీళ్ల వంద మందిలో పది మందికే ఇవ్వడం, అది కూడా వీధుల్లో ఇష్టానుసారం తిప్పడం వల్ల ఓటర్లు సహనం కోల్పోతున్నారు. డబ్బుల పంపిణీకి వచ్చిన ఆయా పార్టీల పంపిణీదారులు ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకుంటున్నారు. ఒక ఇంట్లో ఐదు ఓట్లు ఉంటే రెండింటికి డబ్బులు చేతిలో పెట్టి మిగతా వారికి డబ్బులు తీసుకొస్తామంటూ జారుకుంటున్నారు. కొన్ని వార్డులో ఓటర్లు డబ్బుల కోసం అమాయకంగా రేయింబవళ్లు ఎదురుచూస్తున్నారు. దీంతో ముఖ్యంగా మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. వీధుల్లో ఎక్కడ చూసినా గుంపులుగా జనం కనిపిస్తున్నారు. ఈసారి ఓటుకు రేటు ఎక్కువగా ఉండడంతో ఓటర్లు తమ ఓటు స్లిప్పులు పట్టుకొని తిరుగుతున్నారు. ఓ మధ్యతరగతి కుటుంబంలో నాలుగు ఓట్లు ఉంటే ఎలాలేదన్నా రూ.10 వేలు అయినా వస్తాయని ఆశపడుతున్నారు. అయితే స్థానిక నాయకులు పెద్ద మొత్తంలో సొమ్ములు నొక్కేయడంతో సమస్య తలెత్తుతోంది. కొందరు మహిళలు ఏకంగా అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఓ పార్టీపై అభిమానం ఉన్నా నోట్లు చేతిలో పడకపోవడంతో అది వ్యతిరేక ఓటుగా మారే అవకాశం లేకపోలేదు. కాగా.. పక్కా నిఘా ఏర్పాట్లు చేశాం.. ప్రలోభాలను సహించేది లేదంటూ యంత్రాంగం ఎంత ఊదరగొట్టినా.. రూ.500 నోట్లు ఆ మాటలను వెక్కిరిస్తున్నాయి. ఓటర్లకు రూ.500 నోట్లనే చేతికి ఇస్తున్నారు. అంటే ఓట్లు కొనడానికి ఆయా అభ్యర్థులకు రూ.500 నోట్లు భారీ సంఖ్యలో ఎలా సమకూరాయో, యంత్రాంగం కళ్లుగప్పి ఎక్కడ నిల్వ చేశారో అనేది ఇప్పుడు ఓ పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది.

మద్యం పంపిణీ ప్రారంభం



మద్యం ఇప్పటికే పెద్ద మొత్తంలో సమాకూర్చుకున్నారని తెలుస్తోంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గత ఏడాది ఈ తేదీకి ఎంత మద్యం అమ్మకాలు జరిగాయో ఈ ఏడాది అదే తేదీకి అంతే అమ్మకాలు జరగాలి. డిస్టిలరీల్లో మద్యం తయారు చేసి బయటకు విక్రయించరు. అలా కొనుగోలు చేయాలంటే ఎక్సైజ్ కమిషనర్ అనుమతి తప్పనిసరి. డిస్టిలరీల నుంచి డిపోలకు అక్కడి నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు, బార్‌లకు మద్యం చేరుతుంది. అయితే మద్యం తయారీ డిస్టిలరీల్లో 90శాతం వైసీపీ నేత చేతుల్లో ఉన్నాయనే విషయం జగద్విదితం. లెక్కల్లో చూపించకుండా తయారు చేసిన మద్యాన్ని డిస్టిలరీల నుంచి నేరుగా నాయకుల ఇళ్లకు చేర్చారని చెబుతున్నారు. పోలింగ్ రోజు, అంతకు ముందు రోజు.. అంటే 11 సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకూ మద్యం దుకాణాలు మూతపడడంతో.. నిల్వ చేసిన ఆయా అభ్యర్థులు నిల్వ చేసిన మద్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమం మొదలు పెడతారని తెలుస్తోంది. అలాగే. నాటుసారాను కూడా గుట్టుగా పెద్ద ఎత్తున తయారు చేయించారని చర్చ నడుస్తోంది. సారాను అతి సులభంగా పంచే అవకాశం ఉండడంతో ఇప్పటికే తయారు చేసిన మద్యాన్ని ప్యాకెట్ల రూపంలో రహస్య ప్రదేశాల్లో ఉంచారని వినవస్తోంది.

స్థానిక నాయకులకు అవమానాలు

ఉప్పలగుప్తం, మే 11: ఐదేళ్ల ప్రస్థానంలో చివరి అంకంలోనూ తమకు కనీస గౌరవం దక్కలేదంటూ అధికార పార్టీ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. ఓటర్లకు కాసుల పంపిణీ సైతం పైవారు కానిస్తుంటే అవమాన భారంతో సతమతమవుతున్నారు. డబ్బుల పంపిణీని అధిష్ఠానం నియమించిన స్థానికేతరులు పర్యవేక్షిస్తుంటే తాము వారికి అంగరక్షకులుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందని కొందరు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆది నుంచి అంతం వరకు తమ పాత్రకు కదలికలు, డైలాగులు లేక మూగచిత్రాలుగానే మిగిలామని మరికొందరు వాపోతున్నారు. గతంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సంక్షేమ లబ్ధి పంపిణీ, పింఛన్ల సమస్యలను అధికారులకు చేర్చి పరిష్కరించడం వంటి కార్యక్రమాలు గ్రామ స్థాయి నాయకుల చేతులమీదుగా జరిగేవి. తద్వారా జనంలో వారికి గుర్తింపు, గౌరవం ఏర్పడి ఎన్నికల వేళ వారి మాటకు జనం విలువ ఇచ్చేవారు. గతానికి భిన్నంగా బటన్ నొక్కుడుతో ఐదేళ్ల పాలన తమను కేవలం జెండాల మోతకు పరిమితం చేసిందంటూ గ్రామస్థాయి నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మనస్తాపం చెందుతున్నారు. చివరి దశలో తమ చేతుల మీదుగా ఓటర్లకు డబ్బు పంపిణీ అదృష్టానికి కూడా నోచుకోలేకపోయమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏం చేస్తాం!! చేసుకున్న వారికి చేసుకున్నంత..అని నిట్టూర్చుతున్నారు.

తమవారికే కాసులు

ఉప్పలగుప్తం, మే 11: అవతలి పార్టీ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు కాసుల పంపిణీ పథకం ప్రవేశపెట్టారన్న సంగతి విదితమే. ప్రతి పార్టీకీ ఓటు బ్యాంకు ఉంటుంది. విజయానికి అవసరమైన ఓట్ల కోసం ఇతర పార్టీల అభిమానులకు కాసుల ఎర వేయడం పంపిణీ పథకం లక్ష్యం. గత ఎన్నికల్లో ఒక పార్టీ తరతమ భేదం లేకుండా ఓటర్లందరికీ డబ్బు ఎరవేసింది. కాని ప్రస్తుతం ట్రెండ్ మారింది. అన్ని పార్టీలూ తమ ఓటు బ్యాంకుకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి వారికే డబ్బులు పంచుతున్నారు. ఇది చిత్రంగా అనిపించినా వాస్తవమే. పోటీలో ఉన్న పార్టీలు మొత్తం ఓటర్లలో 70 నుంచి 80 శాతం మందిని పంపిణీకి అర్హులుగా గుర్తిస్తున్నాయి. ఆ శాతంలో తమ పార్టీ ఓటు బ్యాంకును లెక్కలోకి తీసుకుని ఆ జాబితానే అధిష్ఠానానికి పంపిస్తున్నాయి. అంటే ఎవరి సొంత ఓట్లు వారే కొనుక్కుంటున్నారన్నమాట. మరి పార్టీకి అభిమానంతో ఓటేస్తున్న వారు ఎవరన్నది అన్వేషించాలి. వదిలేసిన 20 నుంచి 30శాతం మందిలో కాసులకు ఇష్టపడని కొన్ని సామాజికవర్గాల ఓటర్లు, అభ్యర్థుల అభిమానులు, తటస్థ ఓటర్లు, ఓటింగ్‌కు వెళ్లని వారు ఉంటారు. ఈ ఓటర్లే పోటీలో ఉన్న అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

గుర్తేడులో ట్రైల్ రన్‌కు వచ్చిన వాయుసేన హెలికాప్టర్



తుపాకీ నీడలో..

రంపచోడవరం, మే 11: రంపచోడవరం మన్యం నియోజకవర్గంలో ఎన్నికలు అధికారులకు కత్తిమీద సాములా మారాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా గుర్తింపు ఉన్న ఈ మన్యం నియోజకవర్గం మొత్తం దాదాపుగా తుపాకీ నీడలోకి వెళ్లిపోయింది. సి.ఆర్.పి.ఎఫ్, ఇతర ప్రత్యేక పోలీసు బలగాలు, సాధారణ పోలీసులతో కలిపి సుమారుగా 4 వేలకు పైగా పోలీసులను ఇక్కడ ఎన్నికల కోసం వినియోగిస్తున్నారు. గత వారం రోజులుగా మావోయిస్టు ప్రభావిత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లోనూ, వాటి సరిహద్దుల్లోనూ అనునిత్యం కూంబింగ్ కొనసాగుతోంది. మరోపక్క ఎన్నికల సిబ్బందిని ఈ సమస్యాత్మక గ్రామాలకు తరలించే ప్రణాళికలను రంపచోడవరం రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అమలు చేస్తున్నారు. ఆరు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని, సామగ్రిని తరలించి, తిరిగి రప్పించేందుకు వాయుసేనకు చెందిన 3 హెలికాప్టర్లను రప్పించారు. శనివారం ఈ హెలికాప్టర్లుతో వై.రామవరం మండలం గుర్తేడు వరకూ ట్రైల్ రన్‌ను కూడా నిర్వహించారు. ఈ గిరిజన నియోజకవర్గం 6 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న 11 మండలాల్లోని సుమారు 800 ఆవాసాలకు చెందిన 399 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇక్కడ సుమారు 239 క్లిష్టమైన గ్రామాలను గుర్తించారు. ఇక్కడ ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉండటంతో పోలీసు యంత్రాంగం ప్రత్యేక భద్రతా, బందోబస్తు ఏర్పాట్లు చేయగా, మావోయిస్టు అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలు తుపాకీ నీడలోకి వెళ్లిపోయాయి. సుమారుగా 3 వేల మంది వరకూ ఎన్నికల కోసం సిబ్బందిని వినియోగిస్తున్నారు. 76 రూట్లలో 59 సెక్టార్లను ఏర్పాటు చేశారు. సుమారు 200 వరకూ వాహనాలను ఈ ఎన్నికల కోసం వినియోగిస్తున్నారు. వై.రామవరం మండలం గుర్తేడు, పాతకోట, ఇర్లవాడలో ఉన్న 7 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, సామగ్రిని తరలించేందుకు 3 వాయుసేన హెలికాప్టర్లను రప్పించారు. చింతూరు మండలంలో మావోయిస్టుల ప్రభావిత రెండు పోలింగ్ కేంద్రాలను సురక్షిత ప్రాంతాలకు మార్చుతూ ఆ కేంద్రాల పరిధిలోని 9 గ్రామాల్లోని 1447 మంది ఓటర్లను తరలించేందుకు 28 వాహనాలను కూడా ఏర్పాటు చేశారు.

మీ చీరలు మాకొద్దు!



చీరలను తిరస్కరిస్తున్న ఓటర్లు

ఆత్రేయపురం, మే 11: అధికార పార్టీ తాయిలాలను కొన్నిచోట్ల ఓటర్లు స్వచ్ఛందంగా తిరస్కరిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి పులి మెరక వీధి, గుండం చేను ప్రాంతాల్లో శనివారం సాయంత్రం అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఇంటింటికీ వెళ్లి చీరలు పంపిణీ చేశారు. మహిళలు వాటిని తీసుకోకుండా గుట్టలుగా రోడ్డుపై పాడేశారు. దీంతో చేసేది లేక సదరు పంపిణీదారులు ఆ చీరలను తీసుకెళ్లిపోయారు.

నాసిరకం చీరలపై ఆగ్రహం



చీరలను తిరస్కరిస్తున్న మహిళలు

ఆలమూరు, మే 11: నాసిరకం చీరలు ఇవ్వడంపై మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పినపళ్ల, మడికి, మూలస్థానం గ్రామాలకు చెందిన మహిళలు నాలుగు రోజుల క్రితం ఇచ్చిన చీరలను వైసీపీ నాయకుల ఇళ్ల ముందు పడేశారు. ఇవేం చీరలంటూ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుక్కర్‌కు కూపన్లు

ఆత్రేయపురం, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అధికార పార్టీ నాయకులు సామదాన దండోపాయాలు ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు సిల్వర్ కాయిన్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఓటరుకు రూ.2వేలు చొప్పున నగదు అందజేశారు. మేం గెలిచిన తర్వాత ఈ కూపను తీసుకెళ్లి ఈ ప్రాంతంలో ఏ షాపులో ఇచ్చినా ప్రెషర్ కుక్కర్ ఇస్తారని ప్రస్తుతం ఓటర్లకు కూపన్లు ఇస్తున్నారు..

ప్రలోభాలకు గురిచేస్తే..

ఆత్రేయపురం, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై చర్యలకు ఎన్నికల కమిషన్ పటిష్ఠమైన చట్టాలు రూపకల్పన చేసింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రత్యేక టీమ్, అబ్జర్వర్లను సైతం నియమించింది. అభ్యర్థులు ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఐపీసీ 171 (హెచ్) ప్రకారం ద్వారా చర్యలు చేపట్టాలి. ఓటర్లకు డబ్బులు పంచితే ఐపీసీ 171 (బి) సెక్షన్ కింద కేసు నమోదు చేయాలి. ఓటర్లను ఒత్తిడికి గురిచేయడాన్ని, బెదిరించడాన్ని తీవ్ర నేరంగా పరిగణిస్తారు. బాధ్యులపై ఐపీసీ 171 (సి) చట్టం కింద కేసు నమోదు చేయొచ్చు. కానుకలు పంపిణీ చేయడం నేరం. విందు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదు. నిబంధనలను అతిక్రమిస్తే ఐపీసీ 171 (ఇ) చట్టం కింద శిక్షార్హులు. ఎన్నికల్లో ఓ వ్యక్తి మూడు క్వార్టర్లకు మించి మద్యం తీసుకెళ్లడమూ నేరమే. భారీ మొత్తంలో మద్యం తీసుకెళ్తే అబ్కారీ చట్టం కింద కేసు నమోదు చేయవచ్చు.

దివ్యాంగులకు ఉచిత రవాణా

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోడానికి ఎన్నికల సంఘం అన్ని విధాలా ఏర్పాట్లు చేసింది. ఏ ఒక్క ఓటరు కూడా అసౌకర్యం వల్ల ఓటు వేయకుండా ఉండరాదనే ఉద్దేశంతో చర్యలు తీసుకొంది. దీనిలో భాగంగా దివ్యాంగ ఓటర్లకు ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించింది. పోలింగ్ కేంద్రాల వద్ద వారికి సహాయం చేయడానికి వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద తప్పని సరిగా దివ్యాంగులు పోలింగ్ గదిలోకి వెళ్లడానికి వీలుగా ర్యాంపులను నిర్మించారు. దివ్యాంగుల కోసం 'సాక్షం (saksham)' అనే యాప్‌ని ఎన్నికల సంఘం రూపొందించింది. దివ్యాంగులు ఆ యాప్‌ని వారి సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని రిక్వెస్ట్ పంపిస్తే వారికి ఉచిత రవాణా, వలంటీర్ సదుపాయం కల్పిస్తారు.

– రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

అంబాజీపేట, మే 11: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మాచవరంలోని ఓ పీచు ఫ్యాక్టరీలో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. యర్రంశెట్టి వరలక్ష్మికి చెందిన కాయిర్ పరిశ్రమలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి నిప్పురవ్వలు అక్కడే ఉన్న పీచుపై పడ్డాయి. అక్కడ పనిచేసే సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను ఆర్పే ప్రయత్నంచేశారు. అమలాపురం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. పెద్దగా నష్టం సంభవించలేదని తెలిసింది.

- కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించను
- తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి కృషి
- రాజోలు కూటమి అభ్యర్థి దేవవరప్రసాద్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులు దహనం



మండపేట, మే 11: ప్రజల ఆస్తులను దోచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంతెస్తున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను మండపేట టీడీపీ కార్యాలయంవద్ద శనివారం రాత్రి కూటమి నేతలతో కలిసి కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వర రావు ఆధ్వర్యంలో దహనం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ జీవోను రద్దు చేస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం తథ్యమని వేగుళ్ల ధీమా వ్యక్తంచేశారు. టీడీపీ కూటమి నేతలు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, వల్లూరి వీర్రాజుచౌదరి, మాజీ కౌన్సిలర్ మందపల్లి దొరబాబు, వాదా ప్రసాదరావు, చుండ్రు సోమరాజు పాల్గొన్నారు.

'పి.గన్నవరం' సమన్వయ కమిటీ కన్వీనర్‌గా నామన రాంబాబు



నామన రాంబాబు దాసరి సత్యనారాయణ మోకా ఆనందసాగర్

పి.గన్నవరం/అంబాజీపేట, మే 11: పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఏడు సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. సీనియర్ నాయకుడు నామన రాంబాబును కన్వీనర్‌గా, మోకా ఆనందసాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ(డీవీ)లను సహ కన్వీనర్లుగా, నాలుగు మండలా అధ్యక్షుడు తోలేటి సత్యనారాయణ (సత్తిబాబు), చిట్టూరి శ్రీనివాసరావు, దంతులూరి శ్రీనివాసరాజు, మొల్లేటి శ్రీనివాస్‌లను సభ్యులుగా నియమించారు.

ఇక్కడ ఓట్లు అమ్మబడవు



మండపేట, మే 11: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పదవి కోసం ఓటర్లకు తాయిలాలు ఇస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలోని రథం గుడి వద్ద ఉన్న ఒక ఇంటి వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీపై ఈవిధంగా పేర్కొన్నారు. మా గృహములో ఓట్లు అమ్మబడవు, మేము మా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటాము. ఓట్లు కొనడానికి రూపాయలతో ఎవరైనా మా గృహంలోకి వచ్చినట్లయితే వారిపై ఎన్నికల కమిషనర్ ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. 1960 సంవత్సరం నుంచి మేము ఇదే విధానాన్ని పాటిస్తున్నాము అని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.

మూడు రోజులు మద్యం విక్రయాలు బంద్

యానాం, మే11: యానాం సమీపంలో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల13న ఎన్నికల జరగనున్న నేపథ్యంలో యానాంలోని అన్నిహోల్‌సేల్, రిటైల్ మద్యం దుకాణాలు శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి మూసివేస్తున్నట్టు డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ ఆర్.మునిస్వామి తెలిపారు. సోమవారం సాయంత్రం 6గంటల నుంచి మద్యం విక్రయాలు ప్రారంభమవుతాయి.

రాజోలు నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా





మలికిపురం: విలేకరులతో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్, రాజోలు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా



రాజోలు: ములికిపల్లిలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆకుమర్తి చిన్నా

మలికిపురం, మే 11: సమస్యలతో కూడుకున్న రాజోలు నియోజకవర్గాన్ని సమస్యలు లేని ప్రాంతంగా అభివృద్ధి చేయడం నా లక్ష్యమని రాజోలు అసెంబ్లీ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో విలేకరులతో మాట్లాడుతూ తనకు సీటు కేటాయించిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు, రాజోలు నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆఖరుగా విజయీభవ ర్యాలీని భారీ స్థాయిలో నిర్వహించామన్నారు. తనకే ఓటు ఎందుకు వేయాలనే దానిపై మాట్లాడుతూ తాను మిగతా వారిలా కాకుండా నియోజకవర్గంలోని అన్ని సమస్యలను గుర్తించానని, తీర్పు రాకుండానే తాను పనులు చేసుకుంటూ వెళ్తానని అన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ, ఏటిగట్ల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. సమస్యల నుంచి రాజోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు పరుగెత్తిస్తానని, తనకున్న అనుభవం, పరిచయాల ద్వారా ఈ ప్రాంత అభివృద్ధే ఎజెండాగా వెళతానన్నారు. ఈప్రాంతంలో అవినీతి అన్ని రంగాల్లో విజృంభిస్తుందని, దానిని రూపుమాపడమే నా ఎజెండా అన్నారు. కుటుంబ రాజకీయాలను తాను ప్రోత్సహించనని చెప్పారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి, ఎస్సీ, బీసీల అభివృద్ధికి పనిచేస్తానన్నారు. యువత కోసం ఉపాధి కల్పన, ఆధ్యాత్మిక, పర్యాటక రంగ అభివృద్ధి, గల్ఫ్ వెళ్లేవారికి రక్షణ చర్యలు వంటివి తీసుకుంటానన్నారు. మోరి చేనేత రంగాన్ని అభివృద్ధి చేస్తానని, బీసీల డిక్లరేషన్ ప్రతీ ఓటరుకు చెందేలా చర్యలు చేపడతామన్నారు. నిర్లక్ష్యం చేయబడిన ఈప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు కళాకారుల కోసం స్టేడియం ఏర్పాటుచేస్తానన్నారు. డయాలసిస్ రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని, ఇక్కడ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తానన్నారు.

కూటమిని అధికారంలోకి తీసుకురావాలి

రాజోలు, మే 11: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. బి.సావరంలో టీడీపీ సీనియర్ నాయకుడు జగడం సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన టీడీపీ కూటమి ఎస్సీ కులాల ఆత్మీయ సమావేశం ఆయన మాట్లాడారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో దళితులకు ద్రోహం జరిగిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వాన్ని గెలిపిస్తే దళితులకు కావాల్సిన సంక్షేమాన్ని సాధించుకోవచ్చునన్నారు. చంద్రబాబు ఇచ్చిన సంక్షేమాలు జగన్ ప్రభుత్వం ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రానికి మరలా ముఖ్యమంత్రిగా చంద్రబాబును తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి వరప్రసాద్‌కు గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి హరీష్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కుసుమ రాజ్‌కుమార్, చుట్టుగుళ్ల సత్యనారాయణ, ముగ్గు పెద్దిరాజు, గంజి అనంతం, ఉండ్రు శ్రీరామారావు, ఎస్.సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మాదిగల అభ్యున్నతి

రాజోలు, మే 11: టీడీపీ హయాంలోనే అనేక రంగాల్లో మాదిగలు అభ్యున్నతి చెందారని టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆకుమర్తి చిన్నా తెలిపారు. ములికిపల్లిలో మాజీ సర్పంచ్ అనుచూరి పురుషోత్తం అధ్యక్షతన శనివారం జరిగిన మాదిగల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. చంద్రబాబు మాదిగల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేగుళ్ల విజయం కోరుతూ కుమార్తెలు, కుటుంబ సభ్యుల ప్రచారం







కేశవరంలో వేగుళ్ల సోదరుడి కుమార్తె మణిమంజరి ప్రచారం, కేశవరంలో ప్రచారం చేస్తున్న వేగుళ్ల కుమార్తెలు, కుటుంబసభ్యులు, కపిలేశ్వరపురం:కోరుమిల్లిలో వేగుళ్ళ బంధువుల ఎన్నికల ప్రచారం

కపిలేశ్వరపురం, మే11: మండపేట నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోరుతూ శనివారం కోరుమిల్లి, చినకోరుమిల్లి గ్రామాల్లో కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో వేగుళ్ల కుమార్తె మణిమంజరి, కోడలు హని, మరోబంధువు కోటిపల్లి శ్రావణి ఇంటింటా తిరిగి ఎన్డీయే కూటమి మేనిఫెస్టోను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ.1500, ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు, 50ఏళ్లు దాటిన ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు నెలకు రూ.5వేలు పింఛన్ అందిస్తామన్నారు. ఈనెల13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వేగుళ్లకు, ఎంపీ హరీష్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని వారు కోరారు. గ్రామంలో పర్యటించిన వారికి అడుగడుగునా స్వాగతంపలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, మండల జనసేన అధ్యక్షుడు తుట్టపు నాగరాజు, మోటుపల్లి బాపిరాజు, కె.సుబ్రహ్మణ్యం, వి.వీవభద్రం, సుంకరబుజ్జి, కొండిశెట్టి నాగేశ్వరరావు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

అంగరలో వైసీపీకి చెందిన పిల్ల బసవరాజు, తోరాటి శ్రీను ఆధ్వర్యంలో శనివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ సమక్షంలో వైసీపీకి చెందిన 30మంది జనసేనలో చేరారు. జనసేన పార్టీలో చేరిన వారిలో 2వ వార్డు వలంటీర్ సంకాబత్తుల సుభాష్, బండారు మూలాస్వామి, కుడకా శ్రీను, మోటుపల్లి రామకృష్ణ, గంగుమళ్ళ సుబ్బన్న, చిల్లర రాజు, చింతపల్లి ధన, గంగుమళ్ళ శ్రీను, మోటూరు సాయి, సత్యనారాయణ, గేదెల శ్రీను తదితరులు ఉన్నారు.



వైసీపీ నేత సతీష్‌రెడ్డిని టీడీపీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

వేగుళ్ల కుటుంబ సభ్యుల ప్రచారం

మండపేట, మే 11: కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయంకోసం వేగుళ్ల చిన్న కుమార్తె సాయిసుమన, సోదరుడి కుమార్తె మణిమంజరి కేశవరంలో శనివారం మహిళలతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. తమ తండ్రి వేగుళ్లతో పాటు అమలాపురం ఎంపీగా పోటీచేస్తున్న గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని కోరారు. వేగుళ్ల కుమార్తెలతో పాటు వేగుళ్ల బంధువులు, మున్సిపల్ వైస్‌మాజీ చైర్మన్ గడి సత్యవతి, స్థానిక నేతలు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీను, అల్లరాజు, పార్టీ నేతలు, మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు



మండపేట: ఎన్నికల ప్రచారంలో మజ్జిగ తాగుతున్న హరీష్‌మాధుర్, వేగుళ్ల

టీడీపీలో చేరిన వైసీపీ నేత సతీష్‌రెడ్డి

రాయవరం, మే 11: పసలపూడికి చెందిన వైసీపీ నేత నల్లమిల్లి సతీష్‌రెడ్డి ఆదివారం టీడీపీలో చేరారు. మండపేట పార్టీ కార్యాలయంలో సతీష్‌రెడ్డికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గం వైసీపీలో ఉన్న అసమ్మతితో పాటు జగన్ పాలన నచ్చక టీడీపీలో చేరినట్టు సతీష్‌రెడ్డి తెలిపారు.

అందరివాడిగా అందుబాటులో ఉంటా: సుభాష్





కుందూరులో ప్రజలతో సుభాష్, కుందూరులో ప్రజలు సుభాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం





కుడుపూరులో సుభాష్‌తో కలిసి అభివాదం చేస్తున్న పృథ్వీరాజ్, మహిళలతో మాట్లాడుతున్న సుభాష్

కె.గంగవరం, మే 11: మీలో అందరివాడిగా ఉంటా, అందుబాటులో ఉంటూప్రజల సమస్యలు పరిష్కరిస్తానని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం ఆయన కుందూరులో ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. సుభాష్‌ను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలు కూడళ్లలో సుభాష్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ.1500, ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు, 50ఏళ్లు దాటిన ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు నెలకు రూ.5వేలు పింఛన్ అందిస్తామన్నారు. సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పామర్తి బాబి, మేడిశెట్టి బాబి, తాడిగొయ్యి ఆనంద్, కట్టా నాగేశ్వరరావు, తాడి బాలకృష్ణ, జగతా రమణ పాల్గొన్నారు.

కూటమిదే విజయం: పృథ్వీరాజ్

కె.గంగవరం, మే 11: రాష్ట్రంలో కూటమి విజయ అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. శనివారం ఆయన కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్‌తో కలిసి కుడుపూరు గ్రామంలో ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి శ్రీకాళహస్తి వరకు కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయడం ఖాయంగా కనిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పాలన అందిచాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం గురించి వివరించారు. సుభాష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి





ఐ.పోలవరం మండలం మురమళ్లలో కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ప్రచారం చేస్తున్న దృశ్యాలు

ఐ.పోలవరం, మే 11: మండలంలోని మురమళ్లలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కూటమి ప్రభుత్వం చేపట్టనున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈనెల13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల సారధ్యంలో రాష్ట్రంలో సుపరిపాలన రాబోతుందన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవడం ద్వారా రాష్ట్రం అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ.1500, ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు, 50ఏళ్లు దాటిన ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు నెలకు రూ.5వేలు పింఛన్ అందిస్తామన్నారు. ఎమ్మెల్యే తనను, ఎంపీగా హరీష్‌మాధుర్‌లను సైకిల్‌పై గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం అందుతాయన్నారు.

ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు







మురమళ్లలో కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ప్రచారం చేస్తున్న దృశ్యాలు





వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తులు

ప్రజల ఆదరణతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు







వాడపాలెంలో ఉమ్మడి అభ్యర్థి బండారు బ్రదర్స్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం, హరీష్, బండారు బ్రదర్స్‌కు సన్మానం, పూలమాలలతో నీరాజనాలు

కొత్తపేట, మే 11: నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలతో రానున్నది కూటమి ప్రభుత్వమేనని తేలిపోయిందని కొత్త పేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యా నందరావు అన్నారు. శనివారం ఆయన తన స్వగ్రామం వాడపాలెంలో అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికి పూల మాలలతో ముంచెత్తారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో శివారు గ్రామాలకు ఎటువంటి మౌలిక వసతులు అవసరమో తెలుసన్నారు. తనకున్న అవగాహనతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కలయికతో అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి చూపిస్తున్న అభిమానం మరువలేనన్నారు. కూటమి ఉమ్మడి ప్రభుత్వంలో అనుభవజ్ఞుడైన చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పురోగామిదిశగా పయనిస్తుందనడంలో సందేహంలేదన్నారు. ముఖ్యంగా యువకులకు ఉపాధి అవకాశాలు, మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన సంక్షేమ పథకాలు, రైతులకు మేలు చేసే పథకాలతో పాటు ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల పునరుద్ధరణ, వైసీపీ ప్రభుత్వంలో వారు కోల్పోయిన అభివృద్ధి ఫలాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా హరీష్‌మాధుర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ఆత్రేయపురం, మే11: ర్యాలికి చెందిన వైసీపీ నాయకుడు పోతుల వెంకన్న అనుచరులతో టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ పి.పుల్లంరాజువర్మ, టీడీపీ, జనసేన గ్రామశాఖ అధ్యక్షులు మెర్ల నాగేశ్వరరావు, బందెల గురవయ్య కండువాలుకప్పి స్వాగతించారు.

ఓటు హక్కు వినియోగంపై హోర్డింగులు



ద్రాక్షారామ, మే 11: ఓటు హక్కు వినియోగంపై అంబికపల్లి అగ్రహారం రాజరత్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రచారం చేపట్టింది. 'ప్రతి ఓటూ విలువైనదే- కచ్చితంగా ఓటు వెయ్యండి అంటూ' చోడవరం, అంబికపల్లి అగ్రహారం కూడలిలో హోర్డింగులు ఏర్పాటు చేశారు. భారతదేశ భౌగోళిక స్వరూప చిత్రపటంతో ఏర్పాటుచేసిన ఈ హోర్డింగులు ఆలోచింపచేసే విధంగా ఉన్నాయి.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, మే11: కోనసీమ తిరుమల వాడపల్లికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి శ్రీవేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధరాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధసేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.35.94లక్షలు లభించినట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.